
సాక్షి ఒడిశా

శనివారం । 2 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,13,372

వెండి 12 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఆరంభం.. అదుర్స్

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నుంచి స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గిరిజన క్రీడోత్సవాలు-2 ప్రారంభమయ్యాయి.

- 8లో



అప్రమత్తతే ఆయుధం

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరమని, ముందు జాగ్రత్తతోనే నివారణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నేడు కాంగ్రెస్ గూటికి మాజీమంత్రి జయరాం



జయరాం పంగి

జయపురం: కొంతకాలంగా కొరాపుట్ జిల్లాకు చెందిన ఆదివాసీ నేత, మాజీ మంత్రి, మాజీ ఎంపీ జయరాం పంగి కాంగ్రెస్‌లో చేరుతారన్న ఊహాగానాలు శనివారం నిజం కాబోతున్నాయి. తాను డిసెంబర్ 2వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు శుక్రవారం తెలియజేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జయరాం పంగి ప్రకటించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయ వృత్తి వదలి 1974లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన దాదాపు 50 యేళ్లుగా కాంగ్రెస్‌కు విరోధి. 1974లో బిజూ పట్నాయక్ ప్రేరణతో జనతా పార్టీలో చేరారు. ఆయన 1977 నుంచి 2009 వరకు కొరాపుట్ జిల్లా పాటంగి నియోజకవర్గంలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఆయన పలు మంత్రి పదవులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా పార్టీకి ఎంతో సేవల అందించిన పంగిని 2017లో జరిగిన మూడంచెల పంచాయతీ ఎన్నికల సమయంలో పార్టీ వ్యతిరేక పనులకు పాల్పడ్డారన్న ఆరోపణతో రాష్ట్ర బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ చర్యకు ఖంగుతిన్న పంగి బీజేపీ తీర్థం పుచ్చుకుని, 2019లో కొరాపుట్ ఎంపీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. అప్పటి నుంచి బీజేపీ అతడిని పట్టించుకోకపోవడంతో కలత చెంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే బీఆర్‌ఎస్ పరిస్థితి నిరాశాజనకంగా ఉండడంతో తాను 5 దశాబ్దాలుగా వ్యతిరేకిస్తూ వస్తున్న కాంగ్రెస్‌లో చేరనున్నారు.

మునిగుడలో పులి పాదముద్రలు



పులి పాదముద్రలు

రాయగడ: జిల్లాలో కొద్ది రోజులుగా భయపెడుతున్న పెద్దపులి తాజాగా మునిగుడ సమితి దహికల్ పంచాయతీ పరిధి బండుగుడ అడవుల్లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గత వారం రోజులుగా నిర్విరామంగా పులిజాడ కోసం ప్రయత్నిస్తున్న అధికారులు బండుగుడలో పాదముద్రలు కనిపెట్టారు. గుడారి, గుణుపూర్ ప్రాంతాల నుంచి కందమాల్ జిల్లావైపు పెద్దపులి వెళ్లినట్లు అధికారులు గతంలో అనుమానించారు. అయితే తాజాగా మునిగుడ అడవుల్లో పాదముద్రలు గుర్తించడంతో పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి సమయంలో బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కార్యాలయంలోనే ఉద్యోగి ఆత్మహత్య



కార్యాలయంలో ఉరికి వేలాడుతున్న మనోజ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని టెక్‌బాడీ వీధిలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం అక్కడ పనిచేస్తున్న ప్యూన్ ఉరికి వేలాడుతూ కనిపించిన ఘటన ఉద్యోగులను ఆందోళనకు గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. పంద్రీపణి గ్రామానికి చెందిన మనోజ్ దళపతి (29) కొద్ది సంవత్సరాలుగా జిల్లా సాగునీటి కార్యాలయంలో ప్యూన్‌గా పని చేస్తున్నాడు. అయితే రోజూ మాదిరిగానే కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపు తీయగా వేలాడుతున్న మనోజ్ మృతదేహన్ని చూసి వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అనంతరం కార్యాలయం పరిశీలించగా మనోజ్ ఉరి వేసుకున్న చోట మద్యం బాటిల్ ఉంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మొక్కు తీరకముందే..!



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు

ఒకే గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు.. మొత్తం 20 మంది. ఘుటొగాంవ్‌లోని తరణిమాత దర్శనానికి వ్యానులో బయల్దేరారు. అప్పటివరకు ఆనంద క్షణాలు.. అలా సాగుతున్న ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మృత్యువు వెంటాడింది. ఒకరి వెంట ఒకరు అలా 8 మందిని తన ఒడిలోకి తీసుకెళ్లిపోయింది. దీంతో రెండు కుటుంబాల్లో శోకం మిగిల్చింది. ప్రమాదస్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. మృతులంతా ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



నుజ్జునుజ్జైన వ్యాన్ ముందర భాగం

- కెంజొహర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మొత్తం 8 మంది దుర్మరణం
- మృతులంతా ఒకే గ్రామానికి చెందినవారు

భువనేశ్వర్/బరంపురం: కెంజొహర్ జిల్లా బలిజొడి సమీపంలోని 20వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారి పక్కన ఉన్న టువంటి ట్రక్కును ప్రయాణికులతో నిండిన టాటా వింగర్ వ్యాన్ ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో 8 మంది వ్యక్తులు మరణించారు. 12 మంది గాయపడ్డారు. 7 మంది ఘటనా స్థలంలో మృతి చెందగా మరొకరు గాయపడి ఘుటగాంవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. గాయపడినవారిలో 5 మంది జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో 3 మంది పరిస్థితి విషమించడంతో ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ముగ్గురు మహిళలు, 4 మంది పురుషులు మృతి చెందారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఘుటొగాంవ్ సబ్ డివిజినల్ పోలీసు అధికారి సుదర్శన్ గంగై తెలిపారు.

తల్లడిల్లిన పుడమరి

ప్రయాణికులంతా గంజాం జిల్లా పుడమరి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు చెందినవారు. బాధితుల్లో ముగ్గురు మాజీ రాజ్యసభ సభ్యురాలు రేణుబాల ప్రధాన్‌కు బంధువులు. వీరంతా దిగొపాహండి నుంచి ఘుటొగాంవ్‌లోని తరణిమాత దర్శనానికి వ్యానులో బయల్దేరారు. సుమారు 20 మంది భక్తులతో దూసుకుపోయి ప్రమాదానికి గురైన వాహనంలో అత్యధికంగా మహిళలు మరియు పిల్లలు ఉన్నారు. వ్యాను డ్రైవర్ కునుకుపాటుతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో ఆలయానికి 3 కిలోమీటర్ల దూరంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వాహనం ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి వ్యాన్ ముందు భాగం తీవ్రంగా దెబ్బతినగా మరణించిన వారి మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి.

సీఎం సంతాపం

ఘుటొగాంవ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మృతులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన 12 మందికి ఉచిత వైద్యం అందించాలని ఆదేశించారు. వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మృతులు వీరే

మృతుల్లో ఒక కుటుంబానికి చెందిన మితా ప్రధాన్, ఆమె కుమారుడు ఆకాష్, కోడలు లిల్లీ, మరో కుటుంబానికి చెందిన బయాఖండ్ గౌడో, మదన్ గౌడో, మమీన గౌడో, బాబీన గౌడో ఉండగా, మరో వ్యక్తి పేరును పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.



ప్రమాద స్థలంలో భీతావాహ దృశ్యం

రెండు లారీలు ఢీ



సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లా 53వ నంబర్ జాతీయ రహదారి చినిమొహు సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. సత్వర చికిత్స కోసం సమీపంలోని వైద్య కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. చినిమొహులో గ్రామ సమీపంలో రెండు ట్రక్కులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక డ్రైవర్ ఘటనా స్థలంలో మృతి చెందగా, మరో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు మరియు అగ్నిమాపక దళం సంఘటన స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. కాగా మృతుడి వివరాలు లభ్యం కాలేదు. ప్రమాదం జరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలం నుంచి ఈ పరిస్థితులను తొలగించేందుకు పోలీసులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

విజిలెన్స్ దాడులు



జూనియర్ ఇంజినీర్ సునీల్ కుమార్

బరంపురం: గంజాం జిల్లా ఆర్‌అండ్‌బీ జూనియర్ ఇంజినీర్ సునీల్ కుమార్ పాడి ఆదాయానికి మించిన ఆస్తులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ మనోరంజన్ పండా తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గంజాం జిల్లాకి చెందిన జూనియర్ ఇంజినీర్ సునీల్ కుమార్ పాడి అక్రమ ఆస్తులపై విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో 5 వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. గంజాం జిల్లా అస్కాలోని కార్యాలయంతో పాటు రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని రెండు ప్రాంతాల్లో, బరంపురంలోని బంధువుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా భారీ భవనాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల స్థలాల పత్రాలు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ ఖాతా పుస్తకాలు, చెక్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించారు.



సోదాలు నిర్వహించిన భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్

రాష్ట్రానికి చేరిన సొరంగం బాధితులు



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సొరంగ బాధితులు

భువనేశ్వర్: ఉత్తరాఖండ్ సిల్క్యారా సొరంగంలో 17 రోజులు చిక్కుకుపోయి మంగళవారం బయటకు వచ్చిన ఒడిశా కార్మికులు రాష్ట్రానికి శుక్రవారం సురక్షితంగా తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వీరంతా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆయన నివాసంలో కలిశారు. సొరంగం నుంచి రక్షించబడిన 5 మంది ఒడియా కార్మికుల్లో 4 మంది రాష్ట్రానికి చేరారు. రాష్ట్రానికి చెందిన మరో కార్మికుడు తన బంధువులతో ఉత్తరాఖండ్‌లో ఉండిపోయాడు. మయూర్‌భంజ్ జిల్లా బొడొకుదొరొ గ్రామస్తుడు ధీరేన్ నాయక్, జోగిబొందొ గ్రామస్తుడు బిశ్వేశ్వర్ నాయక్, బాలాసోర్ జిల్లా కులొడిహో గ్రామస్తుడు రాజు నాయక్, నవరంగ్‌పూర్‌కు చెందిన భగబాన్ భోత్రా ఈరోజు న్యూఢిల్లీ నుంచి విమానంలో భువనేశ్వర్‌కు తిరిగివచ్చారు. భద్రక్ జిల్లా తపన్ మండల్ ఉత్తరాఖండ్‌లోని తన బంధువుల వద్ద ఉండిపోయాడు. రాష్ట్రానికి సురక్షితంగా చేరిన నలుగురు కార్మికులకు రాష్ట్ర కార్మిక మరియు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ శాఖ మంత్రి శారదా ప్రసాద్ నాయక్, పలు సంస్థలు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) వెలుపల ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఒక్కో కార్మికుడికి రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సొరంగంలో వారి కష్టజీవితాన్ని ముఖ్యమంత్రి వారి నుంచి తెలుసుకున్నారు. వారు నిజంగా హీరోలని అన్నారు. కష్టనష్టాలను ఎదుర్కొని ప్రాణాలతో పోరాడి గెలిచిన తీరు నిజంగా స్ఫూర్తిదాయకమని అభినందించారు.

యువతి ఆత్మహత్య



హరిప్రియ మృతదేహం

రాయగడ: జిల్లాలో మునిగుడలోని గోవర్ధన్ కాలనీలో నివసిస్తున్న హరిప్రియ మాఝి (24) అనే యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సమాచారం తెలుసుకున్న మునిగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్డీపీవో ఎస్. ఒరం తెలిపిన వివరాల మేరకు.. కలహండి జిల్లా ఎం.రాంపురానికి చెందిన హరిప్రియ కంప్యూటర్ శిక్షణ పొందేందుకు మునిగుడకు కొద్ది నెలల క్రితం వచ్చింది. ఈ క్రమంలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటోంది. అయితే శుక్రవారం హరిప్రియ నివసిస్తున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి వెనుక తలుపులు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించి చూడగా ఫ్యానుకు చీర సాయంతో ఉరివేసుకుని ఉన్న మృతదేహం కనిపించింది. కుటుంబీకులకు సమాచారం అందించిన అనంతరం పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6 సెల్‌ఫోన్ టవర్లు ప్రారంభం



సెల్‌ఫోన్ టవర్లను ప్రారంభిస్తున్న ఎంపీ ఉల్కా

జయపురం: కొరాపుట్ జిల్లా మారుమూల దశమంతపూర్ సమితిలో 6 సెల్‌ఫోన్ టవర్లను ఎంపీ సప్తగిరి శంకర ఉల్క ప్రారంభించారు. ఆయనను రాజేంద్ర హుయిక నేతృత్వంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 5 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయబడిన 6 టవర్ల వలన ఆయా పంచాయతీల్లో టెలిఫోన్ సౌకర్యంతో పాటు నెట్‌వర్క్ సౌకర్యం కలుగుతుందని తెలియజేశారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. పూర్తి ప్రాజెక్టుల పనులను శరవేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బందుగాం సమితి ఉపాధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సాధారణ కార్యదర్శి గీతాంజలి పీడిక, పవిత్ర సాంత, బ్లాక్ అధ్యక్షుడు బేణుధర పాత్ర, కార్యదర్శి మోహన్ పాత్రో హియాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

భువనేశ్వర్: భద్రక్ జిల్లా 16వ నంబర్ జాతీయ రహదారి భద్రక్ గ్రామీణ ఠాణా గెలోపూర్ సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 6 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారందరినీ రక్షించి చికిత్స కోసం సమీప వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. భద్రక్ నగరం పాత బజార్ ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులు దోబల్ ప్రాంతానికి వెళ్తుండగా గెలోపూర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై నిలబడి ఉన్న హైవాను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 6 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారందరినీ రక్షించి భద్రక్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఉన్నత చికిత్స కోసం తరలించారు.

క్లుప్తంగా

గోడకూలి ఇద్దరు మృతి



కూలిన గోడ

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లా కుచిండా పోలీసుస్టేషన్ పరిధి బిజాడిహి గ్రామంలో శుక్రవారం గోడ కూలి ఇద్దరు వ్యక్తులు మరణించారు. మృతుల్లో గోడ కూలిన ఇంటి యజమాని నమితా పటేల్, కిందిరా గ్రామానికి చెందిన కార్మికుడు లలిత్ దెహురి ఉన్నట్లు గుర్తించారు. నమిత తన పాత ఇంటి గోడను కూల్చివేయడానికి లలిత్ దెహురిని నియమించింది. గోడ పాతబడి బలహీనంగా ఉండడంతో కొత్తగా నిర్మించేందుకు ఉదయం దాన్ని కూల్చివేస్తుండగా నమిత, లలిత్‌పై పడింది. తక్షణమే వీరిని ఘటనా స్థలం నుంచి హుటాహుటిన చికిత్స కోసం కుచిండా సబ్-డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే వారు మరణించినట్లు ధ్రువీకరించారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదు విభాగాల్లో గల పలు పోస్టుల నియామకాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 విభాగాల్లో 63 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా పోస్టుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల ఈనెల 4వతేదీ సాయంత్రం 5 గంటల లోగా తెలియజేయాలని సూచించారు.

రెండు పశువుల శాలలు దగ్ధం

సీతానగరం: మండలంలోని జానుమల్లువలసలో గురువారం రాత్రి ప్రజలు గాఢనిద్రలో ఉండగా సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల శాలలు దగ్ధం కాగా, బండిలాగే పశువు అగ్ని ప్రమాదానికి గురైనట్లు ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు బాధితులు తెలిపిన వివరాలపై ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు నిద్రలో ఉండగా వై.తిరుపతిరావు, జి సింహాచలానికి చెందిన పశువుల శాలల్లో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. అగ్నికీలలు ఎగిసిపడుతున్న సమయంలో ప్రజలు మంటలను అదుపుచేసినట్లు తెలియజేశారు. ఆప్రమాదంలో గాయాల పాలైన తిరుపతిరావుకు చెందిన పశువుకు మండల పశువైద్యాధికారి రామారావు వైద్య సేవలందిస్తున్నారని తెలియజేశారు. శాలలో ఉన్న విలువైన టేకు కలప అగ్నికి ఆహుతైందన్నారు.

శివాలయంలో హుండీ చోరీ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలోని నారాయణ స్కూల్ సమీపంలో గల శ్రీ పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలోని హుండీని దొంగలు ఎత్తుకుపోయి అందులో డబ్బు దోచుకుని ఖాళీ హుండీని చెరువులో విసిరేశారు. ఈ ఆలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లడం ఇది మూడోసారని ఆలయ అర్చకుడు సురేష్ తెలిపారు. విషయాన్ని తెలుకున్న పట్టణ పోలీసులు అలయానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు రూ.50 వేల వరకు నగదు దొంగతనం జరిగినట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక కోట జంక్షన్ సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం అక్కడికి వెళ్లి పరిశీలించి పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా ఆమె వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతురాలు సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయసు కలిగి ఉంటుందని సీఐ వెంకటరావు తెలిపారు. బంధువులె వరైనా గుర్తిస్తే వెంటనే తమను సంప్రదించాలని కోరారు.

నేడు ఆహార కమిషన్ సభ్యుడి రాక

పార్వతీపురం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు శనివారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆయన పార్వతీపురం చేరుకుని, వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

పార్వతీపురం: ఖరీఫ్‌కు సంబంధించి ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 306 ఆర్‌బీకేలకు గాను 185 ఆర్‌బీకేల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. క్వింటాకు ఎ గ్రేడ్ రూ.2203, సాధారణ రకం రూ.2183లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూం నంబర్లకు ఉదయం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. జిల్లా కంట్రోల్ రూం నంబర్ 08963-293037 / 7702003582, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూం నంబర్ 1800-4251967, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1967 అని తెలియజేశారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదులి తదితరులు



క్రీడాజ్యోతిని ప్రదర్శిస్తున్న క్రీడాకారులు



విజేతల కోసం సిద్ధమైన బహుమతులు



సాంప్రదాయ వాయిద్యాలతో నృత్యాలు

ఆరంభం.. అదుర్స్

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నుంచి స్పెషల్ దవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గిరిజన క్రీడోత్సవాలు-2 ప్రారంభమయ్యాయి. క్రీడల్లో జిల్లాలోని 11 సమితుల నుంచి ఆదివాసీ, హరిజన తెగలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గౌరవ అతిథులుగా బిజూ స్వాస్థ్య సమితి రాష్ట్ర శాఖ సలహాదారుడు సుధీర్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఏఎస్పీ విష్ణు ప్రధాస్ పాత్రో, గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతి ప్రభ ప్రధాన్, జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్‌ప్రధాన్, ఏడీఎం భాస్కర రైతా, బిస్సంకటక్ సమితి వైస్ చైర్మన్ దేవీ పట్నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భారత్ భూషన్ స్వయి, పృథ్వీరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు. ఎస్డీసీ చైర్మన్ అనసూయ మాఝి నేతృత్వంతో మూడు రోజుల పాటుగా జరగనున్న ఈ క్రీడోత్సవాలు ఆదివారంతో ముగుస్తాయి.

– రాయగడ



ఆదివాసీల సాంప్రదాయ నృత్యాలు



ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన స్థానికులు, ప్రముఖులు



క్రీడోత్సవాలకు హాజరైన అతిథులు



క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు

అప్రమత్తతే ఆయుధం

- ఘనంగా ఎయిడ్స్ నివారణ దినోత్సవం

హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరమని, ముందు జాగ్రత్తతోనే నివారణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు చేపట్టి నినాదాలు చేశారు. ఆరోగ్యకరమైన జీవితమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: మినీ మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు



జయపురం: బహుమతులతో విద్యార్థులు



రాయగడ: చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



పర్లాకిమిడి: సమావేశానికి విచ్చేసిన ఆరోగ్య కార్యకర్తలు, నర్సులు



పర్లాకిమిడి: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎంవో సిబ్బంది



పర్లాకిమిడి: మాట్లాడుతున్న సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో



జయపురం: మాట్లాడుతున్న హెచ్ఎం మెహర్



పర్లాకిమిడి: ఆరోగ్య కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీఎంవో డాక్టర్ పాత్రో




మల్కన్‌గిరి: ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో

విద్యల నగరంలో పుట్టడం అదృష్టం

విజయనగరం టౌన్: మహనీయులు నడయాడిన నేలపై పుట్టడం నా అదృష్టం.. శతాబ్ది గాయకుడు పద్మశ్రీ ఘంటసాల జయంతిని పురస్కరించుకుని గాన గంధర్వుని ఆశీస్సులు లభించడం ఆనందంగా ఉంది.. ఈ పురస్కారం తన జీవితంలో మరిచిపోలేనిదని సినీ, సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. ఘంటసాల 108వ జయంతిని ఘంటసాలస్మారక కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ నా జీవితంలో తొలిసారిగా నేను నేర్చుకున్నదే ఘంటసాల పాట అని తెలిపారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి రచనలో 'నేనొక పూలమొక్క కడలించి.. తకుక్కుమన్నది పుష్పవిలాప కావ్యమై.. అంటూ పాడి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారు. తను ఎవరివద్ద సంగీతంలో శిష్యరికం చేయకపోయినా సంగీతదర్శకుడిగా ఎదగడం విద్యలనగరం గొప్పతనంగా పేర్కొన్నారు. సమాజంలో మార్పుకోసం ట్రిగ్గర్ అనే షార్ట్‌ఫిల్మ్ చేశానని, ఇది సమాజంలో మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఆస్కార్ అవార్డుకు క్వాలిఫై అయిందన్నారు. ఘంటసాల వంటి దిగ్గజం సంగీత ప్రపంచంలో మరెవ్వరూ లేరన్నారు. అటువంటి మహనీయుడు ఏలిన సంగీత ప్రపంచంలో తను ఒక సంగీత దర్శకుడు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనను విజయనగరం పిలిచి సత్కరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్, డాక్టర్ ఎ.గోపాలరావు, ఈఆర్ సోమయాజులు తదితరుల చేతుల మీదుగా ఘంటసాల స్మారక పురస్కారం అందుకున్నారు.



సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు కౌశిక్, కళాపీఠం వ్యవస్థాపకులు



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనిలు

అలరించిన సంగీత స్వరాభిషేకం

ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గానగంధర్వునికి నిర్విరామంగా 12 గంటలపాటు ఘంటసాల స్వరాభిషేకం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గాయనీ, గాయకులు ఆలపించిన పాటలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. ఇండియన్ ఐడల్ సాయి, పవన్ ఆర్కెస్ట్రాలో ప్రత్యేక ఆహ్వానిత గాయని సౌజన్య అద్భుతమైన పాటలతో ఆకట్టుకున్నారు. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు, ఎస్.జోగారావు, బి.ఉమాశంకర్ సారథ్యం వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, అక్షయ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

సెక్స్ రాకెట్ గుట్టురట్టు

భువనేశ్వర్: స్థానిక సత్యనగర్ ప్రాంతంలోని మసాజ్ పార్లర్‌లో నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్‌ను కమిషనరేట్ పోలీసులు శుక్రవారం ఛేదించారు. ఈ నేపథ్యంలో నలుగురు సెక్స్ వర్కర్లను పోలీసులు రక్షించి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అయితే సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్న సూత్రధారి అక్కడి నుంచి పరారయ్యాడు. మసాజ్ పార్లర్‌లో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు అందిన ముందస్తు సమాచారం ఆధారంగా వ్యూహం పన్నారు. శుక్రవారం కమిషనరేట్ పోలీసులు తమ వ్యక్తిని మసాజ్ పార్లర్‌కు కస్టమర్‌గా పంపారు. డీల్ కుదరడంతో సెక్స్ వర్కర్లను మసాజ్ పార్లర్‌కు రావాలని కోరారు. మసాజ్ పార్లర్ వద్దకు సెక్స్ వర్కర్లు రావడంతో కమిషనరేట్ పోలీసులు మధ్యాహ్నం పార్లర్‌పై దాడి చేశారు. నలుగురు సెక్స్ వర్కర్లను రక్షించగా, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అయితే సెక్స్ రాకెట్ నిర్వాహకుడు తప్పించుకోగలిగాడు.

కాంగ్రెస్ తులసీ యాత్ర



తులసీ యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వంలో పూరీలో శుక్రవారం తులసీ యాత్ర నిర్వహించారు. శ్రీమందిరం నాలుగు వైపుల ద్వారాల తలుపులు, రత్న భాండాగారం తెరిచి మరమ్మతులు, ఆభరణాల లెక్కింపు, వేదాంత స్వాధీనం చేసుకున్న భూములను రైతాంగానికి ఫిరాయించాలని నినాదాలతో రాష్ట్ర కాంగ్రెస్ వినూత్న రీతిలో తులసీ యాత్ర చేపట్టింది. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ యాత్రకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలో 314 మండలాలు, 120 పట్టణ ప్రాంతాల నుంచి తులసీ దళాలు సేకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు గుండిచా దేవాలయం ప్రాంగణంలో సమావేశమయ్యారు. అక్కడ నుంచి సంకీర్తన ఆలాపనతో శ్రీమందిరం సింహద్వారం ప్రాంగణానికి చేరారు. కార్యకర్తలు సేకరించిన తులసీ దళాలను శ్రీజగన్నాథునికి సమర్పించారు. అయితే శ్రీజగన్నాథుడు రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించి ప్రజలకు న్యాయం జరిగేలా అనుగ్రహించాలని ప్రార్థించినట్లు కాంగ్రెసు నాయకులు తెలిపారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత విజయనగరం జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన 70వ సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు సత్తా చాటింది. నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో కర్నూలు జిల్లా గోనెగొండ్లలో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విజయనగరం మహిళా జట్టు విజేతగా నిలవడం పట్ల జిల్లా కబడ్డీ అసియేషన్ అధ్యక్షుడు రంగారావుదొర, కార్యదర్శి కేవీ ప్రభావతి హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారిణులు, కోచ్‌ను అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా మహిళా కబడ్డీ జట్టు

శారడ కర్మాగారం వద్ద ఉద్రిక్తత

- న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యుల ధర్నా
- పోలీసుల సమక్షంలో చర్చలు సఫలం
- రూ 7లక్షల పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం



మృతుడు మహేష్‌బాబు (ఫైల్)

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారడ కార్మాగారం వద్ద శుక్రవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కర్మాగారంలో పనిచేస్తున్న ఎస్.కోట మండలం తిమిడి గ్రామానికి చెందిన డి.మహేష్‌బాబు అకస్మాత్తుగా అస్వస్థతకు గురై గురువారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య తులసి, తల్లి పార్వతిలతో కలిసి మృతుడి బంధువులు, గ్రామస్తులు శుక్రవారం ఉదయం 8 గంటలకు కర్మాగారం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. మృతుడి కుటుంబానికి పరిహారం కింద రూ.30లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ జనరల్ షిఫ్టుకు వెళ్లే కార్మికులను అడ్డగించి ఆందోళన చేశారు. దీంతో కొత్తవలస, ఎస్.కోట సీఐలు చంద్రశేఖర్, బాలసూర్యారావులు సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలను వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి బంధువులు, కర్మాగార యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. చర్యలు సఫలీకృతం కాకపోవడంతో కర్మాగారం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మళ్లీ మరోమారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో చర్చలు జరపగా సఫలీకృతమాయ్యాయి. యాజమాన్యం ప్రతినిధి సన్యాసిరావు మాట్లాడుతూ మృతిని కుటుంబానికి రూ 7లక్షలు పరిహారంతో పాటు భార్య తులసికి కర్మాగారంలో ఉద్యోగం ఇస్తామని, కార్మిక చట్టం ప్రకారం రావాల్సిన పరిహారం అందించేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలపడంతో మృతుడి కుటుంబసభ్యులు అంగీకారం తెలిపారు. దీంతో ధర్నా విరమించారు.



కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, తిమిడి గ్రామస్తులు



మృతుడి కుటుంబసభ్యులతో చర్చలు జరుపుతున్న సీఐ బాలసూర్యారావు

ఇక్కడ తాకట్టు పెట్టి అక్కడ తాకట్టు పెట్టి

గార ఎస్‌బీఐ బంగారం మాయం కేసులో వెలుగులోకి చీకటి కోణం!

- ఖాతాదారుల బంగారం ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ వద్ద తిరిగి తాకట్టు పెడుతున్న వైనం
- అడ్డదారులు తొక్కుతున్న పలువురు బ్యాంకు ఉద్యోగులు
- ఆ దిశగా పోలీసుల విచారణ



బ్యాంకు వద్ద ఖాతాదారులతో మాట్లాడుతున్న సీఐ కామేశ్వరరావు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐలో బంగారం మాయం కేసులో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. బ్యాంకులో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారంలో కొంత ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ చేతికి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా విచారణ జరుపుతున్నారు. శ్రీకాకుళం వన్‌టౌన్ పరిధిలోని ఓ లోన్ కన్సల్టెన్సీతో బ్యాంకు ఉద్యోగులు కుమ్మక్కై కొంత బంగారాన్ని పక్కదారి పట్టించినట్టు తెలిసింది. ఒక్క గార బ్రాంచే కాదు జిల్లాలో అనేక బ్యాంకుల్లో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారం ఈ లోన్ కన్సల్టెన్సీ వద్దకు వెళ్తున్నట్లు భోగట్టా. తీగ లాగితే డొంక కదిలినట్టు గార వ్యవహారంతో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న నయా మోసం వెలుగులోకి వస్తోంది.

'రొటేషన్' చక్రవర్తులెవరో..!

గార స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో దాదాపు రూ.4కోట్ల 70లక్షల విలువైన 7కిలోల బంగారు ఆభరణాలు మాయమైన విషయం తెలిసిందే. ఇందులో బ్యాంకులో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులే సూత్రధారులు, పాత్రధారులుగా ఉన్నారు. అయితే, ఈ పాపంలో ఓ ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ కూడా ఉన్నట్టుగా తాజా సమాచారం. ఖాతాదారులు తమ అవసరాల కోసం బంగారు ఆభరణాలను బ్యాంకులో కుదవ పెట్టగా, బ్యాంకు స్ట్రాంగ్ రూమ్‌ల్లోని సేఫ్‌లో భద్రంగా ఉంచాల్సిన ఆ బంగారు ఆభరణాల్లో కొన్నింటిని తిరిగి ఓ ప్రైవేటు కన్సల్టెన్సీ వద్ద పెట్టి మారు లోన్ తీసుకున్నట్టుగా తెలిసింది. బ్యాంకులో ఉన్నా ప్రైవేటు కన్సల్టెన్సీ వద్ద ఉన్నా, ఒక్కటేనని, ఖాతాదారుల బంగారు ఆభరణాలనే లోన్ కన్సల్టెన్సీ వద్ద పెట్టి కొందరు ఉద్యోగులు తిరిగి లోన్ తీసుకుంటున్నట్టు సమాచారం. అంటే ఖాతాదారుల బంగారాన్ని తమ అవసరాల కోసం, పెట్టుబడి కోసం, టర్నోవర్ కోసం కొందరు ఉద్యోగులు రొటేషన్ చేస్తున్నారు. గార బ్రాంచ్‌లో కుదవ పెట్టిన బంగారు ఆభరణాల్లో చాలా వరకు ఈ ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ వద్దకు చేరినట్టు తెలుస్తోంది. ఆ దిశగా పోలీసులు విచారణ కూడా జరుపుతున్నారు. పోలీసులకు ఎస్‌బీఐ అధికారులు ఇచ్చిన ఫిర్యాదులో ఆ లోన్ కన్సల్టెన్సీ పేరు కూడా ఉన్నట్టు తెలిసింది.

ఈ వ్యవహారం ఒక్క గార బ్రాంచ్‌కే పరిమితమయ్యేలా లేదు. ఈ రకంగా నౌపడ, కాశీబుగ్గలోని బ్యాంకుల్లో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారం కూడా ఈ ప్రైవేటు కన్సల్టెన్సీ వద్దకు వచ్చినట్టు తెలిసింది. ఈ కోణంలో కూడా పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. శ్రీకాకుళం వన్‌టౌన్ పరిధిలోని ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీతో జిల్లాలోని వివిధ బ్యాంకు ఉద్యోగులకు సత్సంబంధాలు ఉన్నాయి. తమ బ్యాంకుల్లో కుదవ పెట్టిన బంగారాన్ని ఇక్కడ పెట్టి తిరిగి లోన్‌లు తీసుకుంటున్నట్టు సమాచారం. ఇదో పెద్ద సైడ్ బిజినెస్‌గా మారిపోయింది. ఇదే రకంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్యాంకులకు సంబంధించిన బంగారు ఆభరణాలు ఈ ప్రైవేటు కన్సల్టెన్సీ వద్దకు వచ్చి ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దొరికితే దొంగ.. లేకపోతే..

గార వ్యవహారంతో వెలుగు చూస్తున్న చీకటి కోణాలు పోలీసు అధికారులను ఆశ్చర్యపరిచినట్టు సమాచారం. కుదవ పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు ఖాతాదారులు వస్తే.. రెండు మూడు రోజుల్లోగా ఇస్తామని చెప్పి.. ఈలోగా ఆ ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ వద్ద ఉన్న బంగారాన్ని తిరిగి ఖాతాదారులకు తెచ్చి ఇస్తున్నారు. దొరికితే దొంగ లేకపోతే దొర అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. బంగారం మిస్సింగ్ కేసు ఆరోపణలు ఎదుర్కొంటూ ఆత్మహత్యకు పాల్పడిన మహిళ సోదరుడు కూడా సవాల్ విసురుతున్నారు. ఆమె చనిపోయిన తర్వాత కేసులు పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇందులో చాలా మంది పాత్ర ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ క్రమంలో చనిపోయిన మహిళా ఉద్యోగి కాల్‌డేటా, ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ కాల్ డేటా, గార బ్రాంచ్‌లోని వివిధ ఉద్యోగులతో లోన్ కన్సల్టెన్సీతో ఉన్న సత్సంబంధాలపై ఆరా తీస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశం కనబడుతోంది.

మా నగల సంగతేమిటి..!

గార: స్థానిక ఎస్‌బీఐలో నగలు మాయం కావడంతో ఖాతాదారులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం చాలా మంది బ్యాంకు వద్దకు వచ్చి తమ ఖాతా వివరాలపై ఆరా తీశారు. సీఐ కామేశ్వరరావు బ్యాంకు వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణతో కూడా కొందరు మాట్లాడారు. బంగారం పోయిన వారి వివరాలు ఇవ్వాలని కోరగా అలా చేయలేమని, ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

'ఆర్‌బీకేలతో మెరుగైన సేవలు'



పెంట ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న జేడీ శ్రీధర్

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని పెంట రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన పంటలను ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మడ్డువలస నీరు రబీకి అందించాలని కోరారు. 35 ఎల్ వద్ద గేట్ లేకపోవడంతో తమ భూములకు సాగునీరందడం లేదని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, ఏడీఏ వెంకటరావు, ఏఓ యర్రా శారద, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పైడిచింతల కుమసు, అలుగోలు లక్ష్మీ నారాయణ, ముంతా హేమంత్, సింహాద్రి హరీష్ పున్నాన పాపినాయుడుల తోపాటు సిబ్బంది ఉన్నారు.

'నార్ల'కు నివాళి



నార్ల వెంకటేశ్వరరావు చిత్ర పటానికి జర్నలిజం విభాగంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అలనాటి పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరావు 115 జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. తెలుగు జర్నలిజానికి ఆయన చేసిన కృషిని వివరించారు. ఎంజేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గుంట లీలా వరప్రసాద్‌రావు, డాక్టర్ రెడ్డి తిరుపతిరావు పాల్గొన్నారు.

వాహనంతో ఈవీఎంలపై అవగాహన



ఈవీఎం డిమానిస్ట్రేషన్ సెంటర్ మొబైల్ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఓటు వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం దగ్గర ఈవీఎం డిమానిస్ట్రేషన్ సెంటర్‌ను, మొబైల్ ఈవీఎం డిమానిస్ట్రేషన్ వాహనాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

'సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం'



మాట్లాడుతున్న మన్మధరావు

జలుమూరు: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, నవరత్నాలతో పంచాయతీల్లో సువర్ణ యుగంలా పరిపాలన సాగుతోందని జిల్లా పంచాయతీ రాజ్ సంఘం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు అన్నారు. ఆయన శుక్రవారం పాగోడు సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలాకి మండలం ఈదుళ్లవలస కూడలి వద్ద టీడీపీ నాయకుడు గొండు శంకర్ చేసిన వ్యాఖ్యలను మన్మధరావు ఖండించారు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం సర్పంచ్‌లు, 95 శాతం ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఉన్నారన్నారు. దీనికి భిన్నంగా టీడీపీ నాయకులైన గొండు శంకర్ తదితరులు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులమంటూ మాట్లాడడం ఎంతవరకూ సమంజసమన్నారు. ఫేక్ సంఘాలు పెట్టి ఫేక్ అధ్యక్షులుగా చెలామణి అవుతూ ఫేక్ ప్రకటనలు మానుకోవాలని సూచించారు. మీ సంఘానికి టీడీపీ సర్పంచ్‌ల సంఘం అని పేరుపెట్టుకోవాలని హితవు పలికారు. దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌తో చెప్పించి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించాలన్నారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్ (రాజా) తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం టౌన్ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన ఫెన్సింగ్ క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్ ఫొటోలను తమ వెంట తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 7660874844ను సంప్రదించాలని ఆయన సూచించారు.

యువ ఓటర్ల నమోదుకు చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): యువ ఓటర్ల నమోదుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గత నెల రోజుల్లో 23,305 మంది 18–19 ఏళ్ల వారిని ఓటర్లుగా నమోదు చేశామన్నారు. మరో 9వేల మందిని కొత్త ఓటర్ల జాబితాలో చేర్చాల్సి ఉందని అంచనా వేస్తున్నామన్నారు. గత నెల రోజుల్లో 65,716 వివిధ రకాల (ఫారం 6, 7, 8) దరఖాస్తులు స్వీకరించామని వివరించారు. వీటిలో 13,661 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఒకే ఇంటి నంబర్‌తో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న 18 ఇళ్లను గుర్తించామని, విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్డీవో సి.హెచ్. రంగయ్య, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్. వెంకట్‌రామన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజం కోసం

ఆడుదాం ఆంధ్రా

- 13 లోపు రిజిస్ట్రేషన్లు పూర్తి కావాలి
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, మరోవైపు ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రూపకల్పన చేసిందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు నిర్వహించనున్న 51 రోజుల మెగా స్పోర్ట్ ఈవెంట్ 'ఆడుదాం ఆంధ్రా'కు జిల్లా స్థాయిలో సన్నద్ధతపై ఆయన అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తోందని 15 ఏళ్లు పైబడిన వారు పాల్గొనవచ్చన్నారు. గ్రామ స్థాయిలో పాల్గొని గెలుపొందిన వారికి మండల స్థాయిలో, ఆ తర్వాత నియోజకవర్గం, జిల్లా చివరిగా రాష్ట్ర స్థాయిలలో పాల్గొనే అవకాశం ఉంటుందని, విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని, క్రీడాకారులకు అవసరమైన కిట్లను సంబంధిత సచివాలయ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచి, అందుకు అనుగుణంగా క్రీడా మైదానాలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీఓలు, నియోజకవర్గ స్థాయిలో ఆర్డీఓలు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు కార్యక్రమాలకు చైర్మన్లుగా వ్యవహరిస్తారని, కార్యక్రమాల నిర్వహణకు ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, శాప్ అధికారులను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా, 'ఆడుదాం ఆంధ్ర' కోసం రిజిస్ట్రేషన్ ఇప్పటికే 'ఆడుదాం ఆంధ్రా.ఏపీ.జీవోవి.ఇన్' లాగిన్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాల్లో 13,219 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వీరిలో బాలికలు, మహిళలు 867 మంది మాత్రమే ఉన్నారని, వీరి సంఖ్య పెరగాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు 1902కు కాల్ చేసి కూడా రిజిస్టర్ చేసుకోవచ్చని, దీనికి డిసెంబర్ 13వ తేదీ చివరి రోజని ఆటల్లో పాల్గొనే వారికి నియోజకవర్గ స్థాయి నుంచి భోజన, వసతి ఏర్పాట్లు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

అయ్యో.. అవ్వ



రాగోలు అర్బన్ లే అవుట్‌లో శుక్రవారం సాయంత్రం.. ఒక ఎనభై ఏళ్ల వృద్ధురాలు ఎటుపోవాలో తెలీక, ఎవరితో మాట్లాడాలో తెలీక బీలగా కనిపించారు. చేతిలో సంచి, అందులో రెండు చీరలు, ఒక దుప్పటితో పాటు పది, ఇరవై రూపాయలు నోట్లు నాలుగైదు మాత్రమే ఉన్నాయి. మెల్లమెల్లగా నడస్తోంది తప్ప సరిగ్గా మాట్లాడడం లేదు. స్థానికులు చూసి నీకు కొడుకులు ఎవరైనా ఉన్నారా అడిగితే కోపంతో తిడుతోంది. సొంతూరు ఏమిటో చెప్పలేకపోతున్నారు. జగనన్న కాలనీలో ఉన్న స్థానికులంతా కలిసి వాకలవలస ప్రాంతంలో గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద విడిచిపెట్టారు.

- శ్రీకాకుళం రూరల్

వంద రోజుల పని దినాలపై దృష్టి



ధర్మపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. ఆయన శుక్రవారం ధర్మపురం, తులసిగాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పంచాయతీల్లో గ్రామ సభల ద్వారా నిర్వహించిన 2024–25 ఆర్థిక సంవత్సర పనుల అంచనాలను తయారు చేసి కలెక్టర్ ఆమోదం కోసం పంపించాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన, పనులు నాణ్యత పాటిస్తూ ఉపాధి కూలీలకు రోజు వారీ వేతనం రూ. 272 వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏపీడీ అమ్మినాయుడు, సీడీసీఎల్ఈ ర్సీ వైవి రమణమూర్తి, ఏపీఓ పి.శ్రీనివాసరావు, టీఏలు దక్కత పితంబర్, బెందాళం మణికంఠ, సునీల్, ఈసీ సురేష్‌లు ఉన్నారు.

4లోపు హార్డ్ కాపీలు ఇవ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 99 అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోపు హార్డ్‌కాపీలు అందజేయాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం చెప్పారు. ఆన్‌లైన్‌లో నవంబర్ 20వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. హార్డ్‌కాపీలు తప్పనిసరిగా అందజేయాలన్నారు. కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిక్రూట్‌మెంట్ ముందుకు సాగుతుందని చెప్పారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

జి.సిగడాం: వాండ్రంగి రైల్వే వంతెన కింద పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతుడి వయసు నలభై ఏళ్లు ఉంటుందని, నలుపు రంగు ఫ్యాంటు, తెలుపు రంగ షర్టు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 7013273731 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యాయ విద్య అలాట్‌మెంట్‌లు

ఎచ్చెర్ల క్యాంపస్: లాసెట్-2023 మొదటి విడత కౌన్సెలింగ్ అలాట్‌మెంట్‌లు ప్రకటించారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రవేశాలు 44కు 37 జరిగా యి. ఎంపీఆర్ లా కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 64 కి 61, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 64కి 10 ప్రవేశాలు జరిగాయి. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ నెల ఐదులోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

'పాఠశాలల్లో ఆడిట్ చేయించుకోవాలి'

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి స్టాటిట్యూరీ ఆడిట్ శనివారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, సరుబుజ్జిలి, పాతపట్నం మండలాలకు చెందిన 120 పాఠశాలలకు సంబంధించి ఆడిట్ చేయించుకోవాలని సూచించారు.

11 నుంచి జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు

గార: వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో డిసెంబర్ 11వ తేదీ నుంచి జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు సంస్థలు నడుపుతున్న విద్యాసంస్థల నుంచి 9, 10, 11, 12 తరగతుల చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో సంప్రదాయ ఆట బొమ్మలు, ఆటలు, నాటకం, గాత్ర సంగీతం, వాద్య సంగీతం, సంప్రదాయ నాట్యం, జానపద నాట్యం వంటి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరి సామగ్రి వారే తెచ్చుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు 9491813995, 9989129255 నంబర్లకు 9వ తేదీలోగా వాట్సాప్ చేయాలని సూచించారు.

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరం (కలెక్టరు ఆఫీసు రోడ్డు), శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 26న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం అందజేయనున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమయ్యే ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు.

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫోన్ నంబర్ 8247861919 కి చేయాలని అన్నారు. విద్యార్థులు సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

4, 5 తేదీల్లో భారీవర్షాలు

ఆమదాలవలస: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక శుక్రవారం తెలిపారు. శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారి ఆదివారానికి తుఫానుగా ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 4న సాయంత్రం చెన్నై- మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో 4,5 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు వరికోతలు, పనులు వాయిదా వేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే వరిచేను కుప్పలపై టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. రాగి, వేరుశనగ, అపరాలు వేసుకునే రైతులు ఈ నెల 7వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు.

క్రమశిక్షణ కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులకు క్రమశిక్షణ కీలకమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ప్రత్యేక పరేడ్‌ను శుక్రవారం నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆమె పరేడ్‌ను పరిశీలించారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీసు కుటుంబాలు పిల్లలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ పోలీస్ శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. పోలీస్ శాఖ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, ఆర్మ్‌డు రిజర్వు డీఎస్పీ వీఎస్ వాసన్ పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అర్హత ఉన్న అందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను అనుసరించి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

అప్రమత్తతతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట



ఎయిడ్స్ నియంత్రణ కోరుతూ ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

అరసవల్లి: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ మన చేతుల్లోనే ఉందని, అప్రమత్తతే దీనికి ఆయుధమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తమార్పిడి సమయంలో ఎయిడ్స్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు వైద్య పరీక్షల సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధం చర్యలు చేపడుతోందని, ప్రస్తుతానికి సుమారు 2 వేల మంది ఎయిడ్స్ బాధితులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. అంతకుముందు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, ఎయిడ్స్ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ అనూరాధ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని స్థానిక కార్యాలయం నుంచి పాతబస్టాండ్, ఏడు రోడ్ల కూడలి మీదుగా బాపూజీ కళామందిర్ వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉన్నతాధికారులంతా ఎయిడ్స్ నియంత్రణ కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. తర్వాత డీఎంహెచ్ఓ మీనాక్షి మాట్లాడుతూ హెచ్ఐవీ పాజిటివ్ ఉన్నంత మాత్రాన ఎయిడ్స్ ఉన్నట్లుగా నిర్ధారణ కాదని, మూడు స్థాయిలు దాటిన తర్వాతే ఎయిడ్స్‌గా మారుతుందన్నారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు కచ్చితంగా మందులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, డీఐఓ ఈశ్వరిదేవి, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి ఉమామహేశ్వరరావు, సంఘ సేవకుడు ఎం.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచన చేస్తోందని ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తివిద్యాధికారి(డీవీఈఓ) కోట ప్రకాశరావు తెలిపారు. ఆయన శుక్రవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం కల్పించేలా ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం హెచ్‌సీఎల్ టెక్‌బీతో ఏపీ ఇంటర్ బోర్డ్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వం రూపొందించిన సరికొత్త ప్రణాళికను విద్యార్థులకు వివరించి వారిని చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత వివిధ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్స్‌దేనని స్పష్టం చేశారు. ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కూడా కల్పించడం ఈ ఒప్పందంలో కీలకాంశమని చెప్పారు. జిల్లాలో 2022-23లో ఇంటర్ పూర్తి చేసిన వారికి, 2023-24(ఈ ఏడాది) విద్యాసంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెలాఖరులోగా సంబంధిత ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మొదటి క్యాట్ ఎగ్జామ్, తర్వాత ఇంగ్లిష్ వర్సంట్ పరీక్ష, చివరిగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఒక ఏడాదిపాటు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల స్టైఫండ్ అందిస్తారని చెప్పారు. విద్యార్థులు రెండు విభాగాల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులు ఐటీ రంగంలోనూ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేటివ్‌కు సంబంధించి డీపీఓ విభాగంలో ఉద్యోగాలను కంపెనీ ద్వారా కల్పించనున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ల గడువుకు సమ యం తక్కువగా ఉండటంతో, వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డీవీఈఓ విజ్ఞప్తి చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పూండి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఉన్న మోహనరావు మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం కంచిలి మండలం అర్జునాపురానికి చెందిన ఎస్.మోహనరావు(45) రైలు కిందపడి ఆత్మహత్య చేసకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. శుక్రవారం పూండి రైల్వే స్టేషన్‌కు సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు పూండి స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పరిశీలిచామని, అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఇతర వివరాలు లభ్యం కావడంతో భార్య లలితకుమారికి, బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు. మృతుడు గత కొంత కాలంగా చెన్నైలోని ఓ కంపెనీలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడని, వివాహేతర సంబంధాలు నెరిపి కుటుంబానికి దూరంగా ఉండడంతో పాటు భార్య లలితకుమారితో నిత్యం గొడవలు పడుతున్నట్లు తెలిసిందని ఎస్ఐ పేర్కొన్నారు. జనవరిలో సంక్రాతి పండగకు వచ్చిన మృతుడు మోహనరావు ఏప్రిల్‌లో తిరిగి చెన్నై వెళ్లిపోయాడని తెలిపారు. మృతునికి డిగ్రీ చదువుతున్న ఓ కుమార్తె ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. శవ పంచనామా చేపట్టి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి భార్య లలితకుమారి, బంధువులకు మృత దేహాన్ని అప్పగించామన్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.